కవితా కౌముది

# పరీక్ష

జ్యోతిర్మయి

నేనీ  పరీక్షను ఎప్పటినుండి వ్రాస్తున్నానో గుర్తులేదు
రాసిన పేజీల బొత్తి మాత్రం చేయి పట్టనంత పెద్దగా ఉంది,
ఈ గదిలో నాలాటివారే అందరూ
కొందరి చుట్టూ వెలుగుల జిలుగులు
మరికొందరి కళ్ళలో అమావాస్య గుబుళ్ళు
పక్కవారి కాగితంలోకి నిక్కినిక్కి చూస్తున్నారు కొందరు
ఎవరి ప్రశ్నలు వారివేనని తెలియదు పాపం!
అన్నీ చూస్తునే వున్నట్టున్నాడు పరీక్షాధికారి
అవసరమైన వారికి అడగకుండానే కొత్త పత్రాలు పంచేస్తున్నాడు,

తెలిసిన ప్రశ్నకు చిరునవ్వు సమాధానమిస్తోంది
అర్థం కాని ప్రశ్న కాలాన్నే ఆపాలని ప్రయత్నిస్తోంది!
పూర్తయిన పేజీలను చూస్తుంటే కొంత సంబరం...కొంత విచారం
కొన్ని కాగితాలు పరిమళాలు పంచుతుంటే
కొన్ని చెమ్మగిల్లి వడలి వేళ్ళాడుతున్నాయి!
అందంగా ఒదిగిన ఇంద్రధనస్సు వర్ణాలు కొన్ని
అక్కడక్కడ కొట్టివేతలతో ఖరాబైన మరకలు మరికొన్ని,
నిర్ణీత సమయంలో పూర్తిచేయలేనేమో అని కంగారుగా ఉంది
పూర్తయ్యాక ఏంచేయాలో తోచకుండానూ ఉంది!

ఎంత సమయం రాస్తానో తెలీదు
కాని ఎప్పటికీ ఇలా రాస్తూనే ఉండాలని ఉంది

సర్వ శక్తులూ ధారపోసి పూర్తిచేస్తున
ఈ పత్రాన్ని ఆపై చదివేవారెవ్వరో?

★★★

## తొంగి చూస్తే..
### సోమేపల్లి వెంకట సుబ్బయ్య

నిన్నటిని
తడిమి తడిమి చూశా
తడితడిగా వెలుతురు

ఈరోజుని
గుండెల నిండా నింపుకున్నా
పిండారబోసిన వెన్నెల

రేపటికోసం
ఆత్రంగా వెతుక్కున్నా
ప్రశ్నలై కురిసిన వాన

జవాబుల వేటకై
ఎగరేయాలి తెరచాప
నాలోకి నేను
ప్రవహించే నేనై

★★★



## అధ్యాస
### కవితా ప్రసాద్

కళ్ళు మూసుకున్నా
తటిత్కాంతి కనబడుతుంది!
చెవులు మూసుకున్నా
ఉరుము వినబడి తీరుతుంది!
ఆత్మజ్యోతిని ఆలోకించాలంటే మాత్రం
మనో నేత్రాన్ని తెరవాల్సిందే!
నాద బ్రహ్మన్ని ఆకర్ణించాలంటే
గుండె చెవుల్ని నిక్కించాల్సిందే మరి!
శక్రచాప సప్తవర్ణోన్మీలనాలు
అనాయాసావలోకితాలు
అతి నీలలోహిత పరారుణవర్ణాలు
అదృశ్యావిష్కృతాలు!
అంతరాళంలోని "కృష్ణ బిలా"ల్లాగా
అస్తిత్వమున్న అగోచారాలెన్నో!
ఆత్మ సాక్షాత్కారానికైనా
పరమాత్మ సాకారానికైనా
అంతర్మథనమే అవశ్యపథం
అనాది ఆస్తి నాస్తి అధ్యాసకు
అనుభవైకమే జ్ఞానపీఠం!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

అన్నియునునింతగా మారుచున్నవేమి?
పుడమియంతయు చింతలోనడరెనేమి?
ఎచటనో పుట్టి యీ యిలనెల్ల చుట్టి
మానవాళిని తాకు రుగ్మత యిదేమి?

భయము నిద్రించునప్పుడు పవలు భయము
ఎప్పుడావహించునొ యంచునెదను భయము
భయము వలయువానిని వీడవలయునంచు
బంధములగూర్చి గుండె లోపల భయమ్ము

మనసు లోపల వెలుపల మసలు భయము
మనుజులందరిలో నెలకొనిన భయము
అన్ని భిన్నత్వములు నేడు పిన్నవయ్యె
ఉర్వి నిండిన యేకత్వమొక్క భయమె!

ఎన్నొ కార్యముల్ నేడు రేపున్నవంచు
వచ్చు వారము కలవెన్నొ పనులటంచు
చేయవలసినవన్ని మస్తిష్కమందు
రొదలు చేయని నిశ్శబ్దసదనమిద్ది

దారి రెండుగ చీలిన స్థలమునందు
నిలిచి నిశ్చేష్టుడైతేమి తెలియలేక
ఏది జీవితపథమేది మృత్యుపథము?
చేర్చుకొనునేది యక్కున చేయి సాచి?

COMMENTS